క్లుప్తంగా

జాగ్రత్తలు తప్పనిసరి



కరకగూడెం: వ్యాధి బాధితులను పరీక్షిస్తున్న వైద్యాధికారిని దుర్గాభవాని

కరకగూడెం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారిని దుర్గాభవాని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం గొల్లగూడెం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులను పరీక్షించారు పలువురు నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా ప్రభుత్వ ఆస్పత్రికి రావాలని మెరుగైన వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ కృష్ణ, నర్సింహారావు, ఏఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు క్రీడామైదానంలో దుమ్ముగూడెం ప్రీమియర్ లీగ్–2 క్రికెట్ పోటీలను బుధవారం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలోని క్రీడాకారులకు తన వంతు సహాయసహకారాలను అందజేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై కేశవరావు, డాక్టర్ పుల్లారెడ్డి, జెడ్పీటీసీ సీతమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి రాముడు, రావులపల్లి రాంప్రసాద్, ఎంపీటీసీ తిరుపతిరావు, సర్పంచ్‌లు, నాయకులు, పోటీల నిర్వాహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చీటింగ్ చేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు?

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఓ బంక్‌లో పెట్రోల్ కొట్టే వ్యక్తిపై అదే బంక్ నిర్వాహకులు బుధవారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సదరు నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం బంక్‌లో ఓ వ్యక్తి పనిచేస్తున్నాడు. కొంత కాలంగా బంక్‌కు పెట్రోల్, డీజిల్ తమ వాహనాల్లో పొయించుకోవడానికి వచ్చిన వినియోగదారులు సాధారణంగా తమ ఏటీఎం కార్డును ఇస్తున్నారు. సదరు వ్యక్తి స్వైప్ చేసి సర్వర్ సమస్య తలెత్తిందంటూ చెప్పున్నాడు. ఆపై మరోమారు కార్డు స్వైపింగ్ చేస్తున్నాడు. దీంతో రెండు మారులు నగదు బదిలీ అవుతుంది. గమనించిన వినియోగదారులు ఈ మధ్య కాలంలో సదరు బంక్ యజమనికి ఫిర్యాదు చేశారు. బంక్‌లో పని చేస్తున్న మరి కొంత మంది వ్యక్తులు కూడా ఫిర్యాదులు అందించారు. దీంతో బంక్ నిర్వహకురాలు పలుమార్లు మందలించింది. అయినప్పటికీ ఆ వ్యక్తిలో మార్పు రాకపోగా బంక్‌కి వచ్చిన వినియోగదారులను మళ్లీ మోసం చేస్తున్నాడు. దీంతో బుధవారం బంక్ నిర్వహకురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదే విషయంపై పోలీసులను వివరణ కోరగా.. తమ వద్దకు ఈ ఘటనకు సంబంధించి ఎవరు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

రిజర్వేషన్లు పెంచాలి

అశ్వాపురం: జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అశ్వాపురంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ, మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు సాధన కోసం మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1,2 తేదీల్లో 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మణుగూరురూరల్: మండల పరిధిలోని కూనవరం గ్రామపంచాయతీ పీవీకాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు గొల్ల రాజ్‌కుమార్ బుధవారం మృతి చెందగా.. విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యలు వారి నివాసానికి వెళ్లి రాజ్‌కుమార్ మృతదేహాన్ని సందర్శించారు. పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సంతాపం తెలిపిన వారిలో వైస్ఎంపీపీ కేవీ రావు, ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు నామా వెంకటేశ్వరరావు,సామా శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

భద్రాచలంలో ట్రాఫిక్ సమస్య

- దుకాణాలపై అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేత
- పార్కింగ్ స్థలాలు లేక ఇక్కట్లు
- రోడ్డుదాటడమే కష్టంగా మారిన వైనం



పాత మార్కెట్ ప్రాంతంలో రోడ్డు పైనే లారీ నిలిపి సామాన్లు దిగుమతి చేస్తున్న దృశ్యం (ఫైల్)



రామాలయం ఎదుట అస్తవ్యస్తంగా వాహనాలు..



భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఇరువైపులా నిలిపి ఉంచిన ఆటోలు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో అసలే ఇరుకు రోడ్లు.. ఆపై ఇష్టానుసారంగా రోడ్లపైనే వాహనాల పార్కింగ్‌లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నారు. ప్రధాన రోడ్లపై ఉన్న వ్యాపార సంస్థలకు పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో సమస్య మరింత జఠిలమైంది.

భద్రాచలం పట్టణం పరిసర ప్రాంతాల పల్లెలకు వ్యాపార కేంద్రంగా మారింది. దీంతో వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రజల రాకపోకలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. మరోవైపు భద్రాచలం పట్టణానికి పక్కనే ఉన్న సరిహద్దు రాష్ట్రాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. సుమారు రోజుకు 3 వేల నుంచి 4 వేల వాహనాలు రాకాపోకలు సాగిస్తాయి. ఈ రద్దీకి అనుగుణంగా పట్టణంలో రోడ్లు లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

ఇదీ సమస్య..

భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్, యూబీ రోడ్డు, పాత మార్కెట్, రామాలయం వీధిలో వాహనాలు నడపాలంటే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు పార్క్ చేస్తుండటంతో ఆ మార్గం ఇరుకుగా తయారైంది. తరుచూ చిన్న చిన్న రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. రోడ్డుపైనే ఆటో డ్రైవర్లు ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం చేస్తుండటంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పాడుతోంది. మరోవైపు పట్టణంలోని వస్త్ర దుకాణాల వద్ద నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తారు. దీంతో ఆ రోడ్డు వాహనాలతో నిండిపోతోంది. రాకపోకలు సాగించే వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు.

వాహనాలకు చలాన్లు..

దుకాణాల ఎదుట వాహనాలను నిలిపి ట్రాఫిక్ సమస్యను తీసుకొస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ఆయా వాహనదారులకు ఫైన్ వేస్తున్నారు. కానీ దుకాణాల వద్ద కొనుగోలు కోసం వచ్చిన తాము వాహనాలను ఎక్కడ నిలపాలని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. మొదట వాహనాలు నిలిపే స్థలాలను ఏర్పాటు చేసి ఆ తరువాత చెలాన్లు వేయాలని తేల్చి చెబుతున్నారు.

చర్యలు చేపడతాం..



ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పట్టణ ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడతాం. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించి, రోడ్డుపై ఆటోలు నిలుపకుండా చర్యలు తీసుకుంటాం. వ్యాపార సంస్థలు, బ్యాంకులు తమ పరిధిలో వాహనాలను నిర్దేశించిన స్థలంలోనే నిలిపి ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే తెలియజేశాం. సంబంధిత అధికారులతో సమన్వయంతో పార్కింగ్ వ్యవస్థను మెరుగు పరిచేందుకు కృషి చేస్తాం.

– పి.నాగరాజు రెడ్డి, టౌన్ సీఐ, భద్రాచలం

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి సునీత

దమ్మపేట: మండలంలోని నాచారం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో మెడికల్ ఆఫీసర్ సునీత, గ్రామస్తులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. బుధవారం మండంలోని నాచారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో ఎయిడ్స్, ఇతర సుఖవ్యాధులతోపాటు క్షయకు సంబంధించిన రక్త పరీక్షలను గ్రామస్తులకు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో పాల్గొన్న మెడికల్ ఆఫీసర్ సునీత మాట్లాడుతూ.. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, రక్తమార్పిడి, కలుషిత ఇంజక్షన్ సూదులు, హెచ్ఐవీ సోకిన తల్లి నుంచి శిశువుకు తదితర కారణాల వలన హెచ్ఐవీ సోకుతుందని తెలిపారు. సంవత్సరానికి ఒకసారి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం రూ.4000ల పెన్షన్ అందిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వెంకటలక్ష్మి, ఆశా వర్కర్ సుజాత, సులోచన, కవిత తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయ హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు బుధవారం లెక్కించారు. గతేడాది నవంబర్ 6వ తేదీ నుంచి ఈ నెల 17వ తేదీ వరకు ఆదాయం రూ.94,022లు వచ్చినట్లు దేవదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకుడు పి.బెయిల్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులు అమ్మవారికి సమర్పించే కానుకలు, నగదును ఆలయం వద్ద ఉన్న హుండీల్లో మాత్రమే వేసి, అమ్మవారి ఆదాయాన్ని పెంచేందుకు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొడియం సత్యవతి, ఆలయ ఈఓ సూర్య ప్రకాష్, ఆలయ కమిటీ చైర్మన్ బిర్రం రమాదేవి, ఆలయ కమిటీ సభ్యులు యూ.నాగేశ్వరరావు, ఎల్.అశ్విని కుమార్, గ్రామ పెద్దలు నరాల శ్రీను, జక్కుల జగదీష్, నారం జగదీష్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు 'యూసుఫ్' టోర్నీ



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న పండు

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న 16వ యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌కు చేరింది. బుధవారం జరిగిన సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి.

తొలి సెమీస్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బూర్గంపాడు స్కై ఎలెవన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. 135 పరుగులు విజయలక్ష్యంతో బరిలోకి దిగిన పాల్వంచ ఫరీద్ ఎలెవన్ జట్టు 9.5 ఓవర్లలో 73 పరుగులు చేసి అలౌటై ఓటమి పాలైంది. స్కై ఎలెవన్ జట్టులోని పండు బౌలింగ్‌లో ఐదు వికెట్లు తీసి, బ్యాటింగ్‌లో 27 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. మధ్యాహ్నం జరిగిన రెండో సెమీస్‌లో భద్రాచలం గుంటుపల్లి ఎలెవన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. 189 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాల్వంచ ఛేజింగ్ ఎలెవన్ జట్టు 13.5 ఓవర్లలో 100 పరుగులకు అలౌటై ఓటమి చెందింది. గుంటుపల్లి ఎలెవన్ జట్టులోని దిలీప్ 62 పరుగులు చేసి, ఒక వికెట్ తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. గురువారం బూర్గంపాడు స్కై ఎలెవన్ జట్టు, భద్రాచలం గుంటుపల్లి ఎలెవన్ జట్టు మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

జ్యోతిబసుకు ఘన నివాళి

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని సీపీఎం కార్యాలయంలో వెస్ట్‌బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు వర్ధంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఆయన ప్రజల కోసం చేసిన త్యాగాలను శ్లాఘించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, పెద్దిని వేణు, అబ్దుల్ రహెమాన్, నాగుల్‌మీరా, రాజా, బత్తుల నాగేశ్వరరావు, కాక హనుమంతరావు, యం అప్పారావు పాల్గొన్నారు.

నేడు ఎంపీపీ సర్వసభ్య సమావేశం

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని మండల పరిషత్ కార్యాలంలో ఎంపీపీ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ జి.రేవతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బాణోత్ పార్వతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా పాల్గొనాల్సిందిగా ఎంపీడీఓ కోరారు.

ఈ దారి బాగుపడేదెన్నడు..?



అధ్వానంగా ఉన్న చర్ల–తాలిపేరు రహదారి

చర్ల: మండల కేంద్రమైన చర్ల నుంచి దోశిళ్లపల్లి మీదుగా తాలిపేరు ప్రాజెక్టుకు వెళ్లే మార్గంలో ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. ఏళ్ల తరబడిగా ఈ రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా ఉన్న ఈ రహదారిలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండల కేంద్రం నుంచి మార్గం గుండా నిత్యం దేవానగరం, దోశిళ్లపల్లి, కంచిపాడు, తాలిపేరు ప్రాజెక్టు, ఉయ్యాలమడుగు, చెలిమెల, తిప్పాపురం, చెన్నాపురం, ఎర్రంపాడు గ్రామాలతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలకు నిత్యం వందలాది మంది ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లలో ప్రయాణించే వారు అధ్వానంగా ఉన్న రహదారితో తీవ్ర అవస్థలు పడుతున్నారు. చర్ల నుంచి తాలిపేరు ప్రాజెక్టు వరకు ఉన్న ఆరు కిలోమీటర్ల దూరంలో దోశిళ్లపల్లి నుంచి తాలిపేరు ప్రాజెక్టు వరకు ఉన్న 1.50 కిలోమీటర్ల దారి మరింత దారుణంగా ఉంది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడి ఉండడం, వాటిలో పెద్ద పెద్ద బండరాళ్లు ఉండడంతో ప్రయాణాలు సాగిస్తున్న వారు అదుపు తప్పి క్రింద పడుతూ గాయాల పాలవుతున్నారు.

మండల కేంద్రంలోనే ఉన్నట్లు ఉన్న ఈ రహదారిపై ఇటు అధికారులు గానీ అటు ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకున్న పాపాన పోకపోవడంతో ఈ మార్గం గుండా ప్రయాణించే వారి బాధలు వర్ణణాతీతంగా మారాయి. సారూ ఈ దారి బాగుపడేదెన్నడో అంటూ ఈ మార్గంలో ప్రయాణించే జనం రోడ్డు బాగు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ రహదారికి మరమత్తులు చేయించేందుకు ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సి ఉంది.

ఆలయానికి రూ.3 లక్షల విరాళం



ఆలయంలో విరాళం అందజేస్తున్న సరోజిని కుటుంబ సభ్యులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామచంద్ర స్వామి ఆలయంలో రామలక్ష్మణుల విగ్రహాల కోసం గ్రామానికి చెందిన దివంగత ఉపాధ్యాయుడు తిప్పారెడ్డి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి సరోజిని, కుటుంబసభ్యులు బుధవారం ఆలయ కమిటీ వారికి రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. విరాళం అందజేసిన తిప్పారెడ్డి సరోజిని, కుటుంబసభ్యులకు సర్పంచ్ మల్లారెడ్డి, ఆలయ కమిటీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి కుమారులు ఎన్ఆర్ఐ తిప్పారెడ్డి సీతారామిరెడ్డి, విజయలక్ష్మి, విద్యావేత్త తిప్పారెడ్డి విజయభాస్కర రెడ్డి, కవిత దంపతులు, సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, గ్రామపెద్దలు జాలె రామకృష్ణారెడ్డి, రణబోతుల రామిరెడ్డి, దైదా నారాయణరెడ్డి, బండారు రవీందర్‌రెడ్డి, వసంత రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థికసాయం



బూర్గంపాడు: ఆర్థికసాయం అందిస్తున్న ఐటీసీ, రోటరీ ప్రతినిధులు

బూర్గంపాడు: ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా సారపాకకు చెందిన వైద్య విద్యార్థి వంశీకి బుధవారం రూ.లక్ష ఆర్థికసాయమందించారు. వైద్య విద్యను అభ్యసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వంశీకి సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో యూనిట్ హెడ్ సిద్ధార్థ మొహంతి చేతుల మీదుగా సాయమందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఐటీసీ, రోటరీ క్లబ్ ప్రతినిధులు శ్యామ్‌కిరణ్, చెంగలరావు, జయంత్‌కుమార్ దాస్, కేవీఎస్ గోవిందరావు, నీలి మురళి, గాయత్రి, యాగి చంద్రశేఖర్, చాంద్‌బాషా, నాగ మల్లేశ్వరరావు, దినేష్, శ్రీకాంత్‌రెడ్డి, కేవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు..

అశ్వాపురం: మండల పరిధిలోని అణుశక్తినగర్ గ్రామానికి చెందిన గుండె వ్యాధి బాధితుడు, నిరుపేద కండె సుజాతకు అశ్వాపురం భరోసా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రూ.4వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యుడు బాజీ మాట్లాడుతూ.. భరోసా ట్రస్ట్ ఆధ్వర్యంలో అత్యవసర పరిస్థితిలో బాధితులకు రక్త దానం చేస్తామన్నారు. భరోసా ట్రస్ట్‌కు సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.ఖదీర్, ట్రస్ట్ సభ్యులు బాజి, డాక్టర్ అర్జున్, షఫీఖాన్, వెంకట్, ఎస్కే.మస్తాన్, బడేమియా, అన్సారీ, నాగుల్‌మీరా, బాజీ తదితరులు పాల్గొన్నారు.

పొగమంచుతో పెనుముప్పు





వాహనాలు కనిపించకుండా రహదారులను కమ్మేసిన పొగమంచు

- రహదారులను కమ్మేస్తున్న మంచు
- అప్రమత్తత లేకుంటే ప్రమాదమే..

కరకగూడెం: చలికాలం వచ్చిందంటే చాలు ఉదయం పొగ మంచుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువ జరుగుతుంటాయి. ఓ రకంగా పొగ మంచులో వాహనం నడపడం సాహసమే. ఎందుకంటే ఎదురుగా వచ్చిన వాహనాన్ని దగ్గరగా వచ్చిన తర్వాత గాని గుర్తించలేం. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. శీతాకాలంలో అత్యధిక ప్రమాదాలు పొగ మంచు కారణంగానే జరుగుతుంటాయి. పొగ మంచు ఉండే సమయాల్లో వాహనచోదకులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ప్రయాణం సాఫీగా సాగుతుంది.

పొగమంచులో ప్రమాదాలకు కారణాలివే..

- పొగ మంచులో అధిక వేగంతో వాహనాలు నడపడం
- మద్యం, నిద్ర మత్తులో వాహనాలు నడపడం
- రహదారి పక్కన, మూల మలుపులు వద్ద జాగ్రత్తలు పాటించకపోవడం
- పలు చోట్ల అధ్వాన రహదారులు
- రహదారులపై రేడియం స్టిక్కర్స్ ఏర్పాటు చేయకపోవడం

దట్టమైన పొగమంచులో పైన చెప్పిన అజాగ్రత్తల మూలంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు. దీంతో ప్రమాదాలు జరుగుతాయి.

జాగ్రత్తలు తీసుకోండి..

- మంచు కురిసే సమయంలో వాహనాలు నడపకపోవడం మంచిది.
- అత్యవసరంగా ప్రయాణం చేయాల్సి వస్తే పొగమంచు కమ్ముకునప్పుడు వాహనాన్ని తక్కువ వేగంతో నడపాలి.
- ఎదురుగా వస్తున్న వాహనాన్ని గుర్తు పట్టేలా హెడ్లైట్స్ ఆన్ చేసి ఉంచాలి.
- వాహనాలకు ఫాగ్ లైట్స్ అమర్చుకుంటే మంచు తెరను చీల్చుకుని వెలుతురు ప్రసరిస్తుంది.



లైట్స్ వేసుకుని ప్రయాణం సాగిస్తున్న ద్విచక్ర వాహనదారుడు

- వాహనాలకు తప్పని సరిగా వైపర్స్ ఉండాలి. అవి పని చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- డ్రైవర్ పక్కన కూర్చున్నవారు డ్రైవింగ్ తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి.
- వాహనం వెనుక, ముందు రేడియం సిక్కర్లు అతికించాలి.
- వాహనానికి అమర్చిన రెడ్ సిగ్నల్, బ్రేక్ సిగ్నల్ పనితీరు ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలి.